క్లుప్తంగా

శాస్త్రోక్తంగా విగ్రహాల ప్రతిష్ఠ



చిత్రేనిపల్లెలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

రుద్రవరం: మండల పరిధిలోని చిత్రేనిపల్లెలో గురువారం సీతారామలక్ష్మణ హనుమాన్ విగ్రహాలతో పాటు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన శాస్త్రోక్తంగా జరిగింది. గ్రామంలోని ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో జీర్ణోద్ధరణ పనులు చేశారు. మూడు రోజుల నుంచి ప్రతిష్ఠోత్సవాలు జరుగుతున్నాయి. చివరి రోజు గురువారం ఆయా దేవతా మూర్తుల విగ్రహాలతో పాటు ధ్వజ ప్రతిష్ఠోత్సవం చేసి వేడుకలను ముగించారు.

దోమల నిర్మూలనతో వ్యాధులు దూరం



కేజీబీవీలోని తరగతి గదుల్లో దోమల మందు పిచికారీ చేయిస్తున్న వైద్య సిబ్బంది

చాగలమర్రి: దోమల నిర్మూలనతో వ్యాధులు దూరం అవుతాయని ఆళ్లగడ్డ సబ్ యూనిట్ అధికారి శివచంద్రారెడ్డి అన్నారు. గురువారం వైద్యారోగ్య సిబ్బందితో కలిసి చాగలమర్రి కస్తూర్బాగాంధీ విద్యాలయలోని తరగతి గదులు, వసతి గృహాల్లో దోమల నివారణ మందులను పిచికారీ చేయించారు. ప్రతిఒక్కరూ ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ముఖ్యంగా మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ఎస్‌ఓ సునీత, హెల్త్ సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, అసిస్టెంట్‌లు మనోహరయ్య, రాముడు, గార్లెట్, లీలావతిదేవి, పుష్పలత పాల్గొన్నారు.

పకడ్బందీగా భూ సర్వే



ఆర్.పాంపల్లెలో భూమి పూజ చేస్తున్న డీటీ

ఉయ్యాలవాడ: శాశ్వత భూ హక్కు– భూరక్ష పథకంలో భాగంగా మండలంలోని ఆర్.పాంపల్లె గ్రామంలో భూముల రీ సర్వే పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌బాబు తెలిపారు. ప్రభుత్వం ఎంపిక చేసిన ఆర్.పాంపల్లె గ్రామంలో రీసర్వే పనులు ప్రారంభించేందుకు గురువారం రైతులతో కలిసి భూమి పూజ చేశారు. ఈ గ్రామంలో 472 మంది రైతులకు చెందిన 1600 ఎకరాల్లో రీ సర్వే చేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ విజయలక్ష్మి, వీఆర్‌ఓలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోండి



లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

రుద్రవరం: అసంపూర్తిగా నిలిచిన పక్కా గృహాలను త్వరగా పూర్తి చేసుకోవాలని హౌసింగ్ డీఈ నాగరాజు, ఇన్‌చార్జి ఎంపీడీఓ సుబ్రమణ్యం లబ్ధిదారులకు సూచించారు. మండల పరిధిలోని పెద్దకంబలూరు, ఎల్లావత్తుల, బీరవోలు గ్రామాల్లో అసంపూర్తిగా నిలిచిన పక్కా గృహాల లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. త్వరగా పూర్తి చేసుకునేందుకు ప్రభుత్వం అదనంగా రూ.50వేలు అందిస్తోందని.. సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

భక్తి శ్రద్ధలతో అతిరాజస్వామి ఆరాధనోత్సవం



అతిరాజ స్వామికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని కల్పనా సెంటర్‌లో వెలసిన శ్రీ కాశిరెడ్డి నాయన ఆశ్రమంలో కాశిరెడ్డినాయన గురువు అతిరాజస్వామి ఆరాధనోత్సవాన్ని గురువారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయాన్నే స్వామి వారి ఉత్సవమూర్తికి, చిత్రపటాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి శాస్త్రోక్తంగా అమృతపాయసాన్ని తయారు చేసి నైవేద్యంగా సమర్పించి మహా మంగళ హారతులు ఇచ్చారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆశ్రమ గౌరవాధ్యక్షుడు డాక్టర్ గోపాల్‌రెడ్డి, చక్రపాణి, ఈశ్వరరెడ్డి, సుబ్రమణ్యం, వేదపండితులు సుబ్బాశాస్త్రి, నాగరాజు శర్మ పాల్గొన్నారు.

దత్తాత్రేయస్వామికి విశేష పూజలు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైల ఆలయ ప్రాంగణంలో వెలసిన దత్తాత్రేయస్వామికి గురువారం లోకకల్యాణార్థం విశేష పూజలు నిర్వహించారు. ఆలయంలోని త్రిఫల వృక్షం కింద నెలవైన దత్తాత్రేయస్వామికి మహాగణపతి పూజ, పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు





యాదగిరి నరసింహస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించిన దృశ్యం, మాజీ ఎమ్మెల్యే శిల్పా, మధుసూదన్ రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

గోస్పాడు: మండలంలోని తెల్లపురి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ యాదగిరి నరసింహ స్వామి దేవాలయంలో గణపతి, శివలింగ, ఆంజనేయ, ధ్వజ స్థిర ప్రతిష్ఠోత్సవాన్ని గురువారం చేపట్టారు. ఆవేద పండితులు తాటిపాటి వెంకటరమణ శర్మ, బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజల అనంతరం విగ్రహాల ప్రతిష్ఠతో పాటు ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. నిర్వాహకులు వారిని ఘనంగా సత్కరించారు. నాయకులు ఆమిదేలా నారాయణ, యాసం రామసుబ్బారెడ్డి, లోకేష్ బాబు, అన్నయ్య, రామలింగారెడ్డి పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం

మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. వేద పండితులు సుధీర్ శర్మ ఆధ్వర్యంలో నందయ్య, కృష్ణ బృందంతో కలిసి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో ఉన్న పుట్ట వద్ద గ్రామ పెద్దల ఆధ్వర్యంలో వేద పండితులు ప్రత్యేక పూజలు చేసి పుట్ట మట్టిని తీసుకొని పంచ పాలికలలో పుట్టమట్టితో పాటు నవధాన్యాలను వేసి 16 రోజులపాటు ఉంచనున్నట్లు తెలిపారు. శనివారం స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

విగ్రహ ప్రతిష్ఠోత్సవం..

ఉయ్యాలవాడ: మండలంలోని గోవిందపల్లెలో రూ.కోటి వ్యయంతో నిర్మించిన ఉమామహేశ్వర స్వామి ఆలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. తొలి రోజు వేద పండితుడు దక్షిణామూర్తి ఆధ్వర్యంలో ఉదయం గోపూజ, గణపతి పూజ, గంగానయనం, పుణ్యాహవచనం, మాతృకాపూజనం, పంచగవ్యకరణం, నవగ్రహ, వాస్తు, కలశస్థాపన, సాయంత్రం మృత్యంగ్రహణం, అంకురారోపణం, అగ్ని ప్రతిష్ఠాపనం, శాంతిహోమం, జలాధివాసం కార్యక్రమాలు జరిగాయి.



గోవిందపల్లెలో నిర్మించిన ఉమామహేశ్వరస్వామి ఆలయం

అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల తనిఖీలు





నంద్యాలలో వాహన తనిఖీలు చేపడుతున్న పోలీసులు

నంద్యాల(అర్బన్): డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని సబ్ డివిజన్లలో పోలీసులు గురువారం రాత్రి ముమ్మర తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు, లాడ్జీలు, బస్టాండ్, రైల్వేస్టేషన్, సరిహద్దు చెక్ పోస్టుల వద్ద తనిఖీలు పెంచారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా తనిఖీలు నిర్వహించారు. నంద్యాల, ఆళ్లగడ్డ, ఆత్మకూరు సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు సిబ్బంది అంతా తనిఖీల్లో పాల్గొన్నారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా ఘటనలపై తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ అదిరాజ్‌సింగ్‌రాణా విజ్ఞప్తి చేశారు.

సమ్మెను జయప్రదం చేయండి

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 20వ తేదీన దేశ వ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ఎం.శంకర్ మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్స్ రద్దు, కనీస వేతనం రూ.26వేలు, ప్రభుత్వరంగ పరిశ్రమలు ప్రైవేటీకరణ ఆపాలి.. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక ఉద్యోగ వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలన్నారు. 16, 17 తేదీల్లో స్కూటర్, ఆటో ర్యాలీలు, పాదయాత్రల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజా సంఘాల నాయకులు బాబాఫక్రుద్దీన్, రంజిత్, శివరాముడు, మస్తాన్, ఈశ్వరమ్మ, ఏసురత్నం, గౌస్, చౌడప్ప పాల్గొన్నారు.

కక్ష సాధింపు చర్యలు దారుణం







ఉయ్యాలవాడలో డీటీకి వినతిపత్రం అందజేస్తున్న విలేకరులు, శిరివెళ్లలో..

సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డికి ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా విజయవాడలోని ఆయన ఇంట్లో పోలీసులు సోదాలు నిర్వహించడాన్ని జర్నలిస్టులు, వివిధ సంఘాల నాయకులు తప్పుపట్టారు. ఏపీ ప్రభుత్వ తీరుకు నిరసనగా గురువారం ఉయ్యాలవాడ, శిరివెళ్ల, దొర్నిపాడు, చాగలమర్రి మండలాల్లో విలేకరులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందంటూ నినదించారు. పత్రికా స్వేచ్ఛను హరిస్తోందని, సాక్షిపై కక్ష సాధింపులకు పాల్పడుతోందని మండిపడ్డారు. అనంతరం ఆయా మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు. ఉయ్యాలవాడలో బాలమద్దిలేటి, చెన్నక్రిష్ణయ్య, సతీష్‌కుమార్, శిరివెళ్లలో పార్వతీశం, రహమాన్, దినేష్, చలపతిరెడ్డి, దొర్నిపాడులో మాలమహానాడు మండల అధ్యక్షుడు సుధాకర్, ఉపాధ్యక్షుడు స్టీఫెన్, కార్యదర్శి శేఖర్, సాలప్ప, ఓబులేసు, సాల్మన్, చాగలమర్రిలో ఎన్‌జీఓ సంఘం సభ్యుడు జీవన్, విలేకరులు దోని రవిపాల్, శివకుమార్, ఖాజారసూల్ తదితరులు పాల్గొన్నారు.

–ఉయ్యాలవాడ/శిరివెళ్ల/దొర్నిపాడు/చాగలమర్రి



దొర్నిపాడులో...,



చాగలమర్రిలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న విలేకరులు





రూపనగుడి వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు, ఉయ్యాలవాడలో మొక్కజొన్న దిగుబడులను ఆరబెడుతున్న రైతు

భారీ వర్షం

ఉయ్యాలవాడ: మండలంలో బుధవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. 18.8 మి.మీ వర్షపాతం నమోదైంది. ఉయ్యాలవాడ, ఇంజేడు, కొండుపల్లె, మాయలూరు, రూపనగుడి, తదితర గ్రామాల్లో రైతులు సాగు చేసిన మొక్కజొన్న దిగుబడులు, వరి పంట దిగుబడులు రహదారులపై, కళ్లాల్లో ఆరబెట్టుకున్నారు. వర్షం రావడంతో దిగుబడులు తడిసి ముద్దయ్యాయి. ఈదురు గాలులతో కురిసిన వర్షానికి పట్టలు కప్పుకునేందుకు సమయం లేకపోవడంతో గింజలు నేలపాలయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి చెన్నకేశవస్వామి ఉత్సవాలు

శిరివెళ్ల: కోటపాడులోని చెన్నకేశవ, వీరభద్ర స్వామి ఆలయాల్లో ఈ నెల 9వ తేదీ నుంచి కల్యాణోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈఓ రామాంజనేయశర్మ తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 9వ తేదీ స్వామి వారికి అభిషేకం, ఆకు పూజ జరుగుతుందన్నారు. 10న స్వామివారికి సుప్రభాత సేవ, అభిషేకం అనంతరం శ్రీదేవీ భూదేవి సహిత చెన్న కేశవస్వామి కల్యాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 11వ తేదీ వసంతోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

11 నుంచి జంతు బలులు నిషేధం



మూలపెద్దమ్మ ఆలయ ప్రాంగణం

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ దేవరను జూన్ 8,9,10 తేదీల్లో జరిపేందుకు నిర్ణయించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తలారి శ్రీనివాసులు, మిద్దె శంకరయ్య, చిన్నన్న, చిన్నపెద్దన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవర సందర్భంగా ఈనెల 11న అమ్మవారికి ముడుపు కడుతున్నందున ఆ రోజు నుంచే జంతుబలులు నిషేధిస్తున్నట్లు చెప్పారు. భక్తులు కేవలం అమ్మవారిని దర్శనం మాత్రమే చేసుకోవాల్సి ఉంటుందన్నారు. కావునా ఈ ఆదివారం నుంచి మొక్కులను చెల్లించేందుకు జంతువులును తీసుకరావద్దని కోరారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం



కరపత్రాలను విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్

శిరివెళ్ల: ఉచిత శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇంద్రావతి అన్నారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డేటా అనలిస్ట్, వెబ్ డెవలపర్‌పై ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 19వ తేదీలోపు పేర్లను రిజిష్టర్ చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 97013 03790 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

బండి ఆత్మకూరు: ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌లకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ, వ్యవసాయ కమిటీ మండల నాయకులు రత్నమయ్య, డేవిడ్ తదితరులు గురువారం ఎంపీడీఓ ఎం.దస్తగిరికి వినతిపత్రం సమర్పించారు. వేలా ది మంది శ్రామికులకు ఉపాధి కల్పిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌లకు కనీస వేతనం రూ. 26 వేలు ప్రకటించి, పీఎఫ్, ఈఎస్ఐ సేవలు కల్పించి, ఉచిత ప్రమాద బీమా రూ.10 లక్షలు ప్రకటించాలని, వారికి రాజకీయ వేధింపులు ఆపాలని కోరారు.

గృహ నిర్మాణ లబ్ధిదారులకు అవగాహన



లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ

చాగలమర్రి: మండలంలోని ఎస్సీ, ఎస్టీ, గిరిజనుల ప్రభుత్వ గృహ నిర్మాణ లబ్ధిదారులకు అదనంగా మంజూరు చేసిన ఆర్థిక సహాయంపై స్థానిక చాగలమ్మ చెంచుగూడెంలో గురువారం ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ అవగాహన కల్పించారు. గత ప్రభుత్వం గృహ నిర్మాణ లబ్ధిదారులకు యూనిట్ కాస్ట్ రూ.1.80 లక్షలు మంజూరు చేసిందన్నారు. అయితే గృహ నిర్మాణానికి కావాల్సిన ఇటుక, సిమెంట్, కడ్డీలు, కూలీల రేట్లు పెరిగిపోవడంతో కొందరు ఇళ్ల నిర్మాణాలను వివిధ దశల్లో నిలిపివేశారని తెలిపారు. వీటిని పూర్తి చేసేందుకు ప్రభుత్వం ఎస్సీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.70 వేలు, ట్రైబల్స్‌కు రూ. లక్ష ఆర్థిక సహాయం మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు. హౌసింగ్, ఇంజినీరింగ్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



ఆలయంలో కళాకర్షణ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా రామాలయ స్వర్ణోత్సవాలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని సంజీవనగర్‌లోని కోదండ రామాలయంలో ఆలయాలు నిర్మించి 50 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా శ్రీ భగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో గురువారం స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా కళాకర్షణ కార్యక్రమం నిర్వహించారు. అలాగే.. కళాశారాధన, హోమాలు, మంత్రాపుష్పం జరిపించారు. సంస్థ సభ్యులు సూరయ్య, శ్రీనివాస్ మాట్లాడుతూ లోక కల్యాణార్థం ఈనెల 28, 29,30, తేదీల్లో పుష్పగిరి పీఠాధిపతి శిష్య బృందంతో మహాకుంభాభిషేకం నిర్వహిస్తారని, కళాకర్షణ కార్యక్రమం ద్వారా గర్భాలయ గోపురాలు, దేవతామూర్తులకు ధ్వజ స్తంభాల్లో కలశాల్లో నిక్షిప్తమైన శక్తిని నూతన కలశంలోకి మంత్రోచ్ఛారణలతో ఆహ్వానించి కలశాలను కుంబాభిషేకం రోజున పునః ప్రతిష్ఠిస్తామని తెలిపారు.

ఉపాధ్యాయులకు ఆంగ్ల భాష నైపుణ్యంపై శిక్షణ



మాట్లాడుతున్న రామేశ్వరగౌడ్



పాల్గొన్న ఉపాధ్యాయులు

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడేలా చేయాలన్నదే తన లక్ష్యమని విల్ 2 కెన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లిష్ సంస్థ డైరెక్టర్ రామేశ్వరగౌడ్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో 600మంది ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఆంగ్లభాష నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణలో 53వేల మంది ఉపాధ్యాయులకు, ఏపీలో 10వేల మంది ఉపాధ్యాయులకు ఉచితంగా శిక్షణ ఇచ్చానని, తెలిపారు. నంద్యాల జిల్లాకు చెందిన 1,800 మందికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. 40 రోజుల పాటు ఆన్‌లైన్ శిక్షణ ఉంటుందని, ఒకరోజు మాత్రం ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. డీఈఓ జనార్దన్‌రెడ్డి, సమగ్ర శిక్ష ఏసీపీ ప్రేమాంతకుమార్, లక్ష్మినారాయణ, యానస్‌బాషా పాల్గొన్నారు.

ఆపత్కాలంలో రెడ్ క్రాస్ అండ



బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): ఆపత్కాలంలో రెడ్‌క్రాస్ సొసైటీ అండగా ఉంటుందని డీసీహెచ్ఎస్ డాక్టర్ జఫరుల్లా తెలిపారు. వరల్డ్ రెడ్‌క్రాస్ డే సందర్భంగా స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. రెడ్‌క్రాస్ జిల్లా కోశాధికారి నాగేశ్వరరావు, మేనేజింగ్ కమిటీ సభ్యులు ఉస్మాన్‌బాషా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ఫౌండర్ జాన్ హెంబ్రీ డూన్యాంట్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జఫరుల్లా మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆధ్వర్యంలో ఇటీవల పట్టణంలో బ్లడ్ స్టోరేజ్ సెంటర్‌ను ప్రారంభించడం శుభపరిణామమన్నారు. మండల చైర్మన్ నాగేశ్వరరెడ్డి, సభ్యులు శీను, డీఎఫ్ఓ షమీ పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్‌పై అవగాహన



సోలార్ విద్యుత్‌పై వివరిస్తున్న అధికారులు

రుద్రవరం: ప్రధాన మంత్రి సూర్యఘర్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని హౌసింగ్ డీఈ నాగరాజు, ఇన్‌చార్జి ఎంపీడీఓ సుబ్రమణ్యం అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు తదితరులకు ప్రధానమంత్రి సూర్య ఘర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఇళ్లపై సోలార్ విద్యుత్ ఏర్పాటుపై ప్రజలను చైతన్య పరచాలని చెప్పారు. వివిధ సామాజిక వర్గాల వారీగా సూర్య ఘర్ వినియోగించుకోవడం వల్ల వచ్చే రాయితీని వివరించాలని సూచించారు.

కుష్టు వ్యాధిగ్రస్తులకు ఎంసీఆర్ చెప్పులు



పంపిణీ చేస్తున్న వైద్యాధికారిణి అంజలి

చాగలమర్రి: మండలంలో నలుగురు కుష్టు వ్యాధిగ్రస్తులకు 2 జతల చొప్పున ప్రభుత్వం నుంచి మైక్రోసెల్యూలర్ రబ్బర్ చెప్పులను పంపిణీ చేసినట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిణి అంజలి తెలిపారు. కుష్టువ్యాధిగ్రస్తులకు కాళ్లకు స్పర్శ లేకపోవడం వల్ల కాళ్లకు పుండ్లు అవుతాయన్నారు. అలా కాకుండా వారికి ప్రభుత్వం ఏటా రెండు జతల ఎంసీఆర్ బెల్ట్ కలిగిన చెప్పులను అందజేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శివరామలింగారెడ్డి పాల్గొన్నారు.

కోర్టులకు వేసవి సెలవులు

నంద్యాల(వ్యవసాయం): జిల్లాలోని కోర్టులకు ఈనెల 12 నుంచి జూన్ 13వ తేదీ వరకు వేసవి సెలవులు ప్రకటిస్తున్నట్లు ప్రిన్సిపల్ జిల్లా జడ్జి కబర్ది గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు, ఆదోని, నంద్యాల, ఆళ్లగడ్డ, అత్యవసర కేసుల కోసం ప్రత్యేకంగా ఇద్దరు జడ్జిలను నియమిస్తున్నట్లు తెలిపారు. కర్నూలు ఏడవ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి లక్ష్మీరాజ్యం 15 రోజుల పాటు ఆ కోర్టుల్లో అందుబాటులో ఉంటారన్నారు. నంద్యాలలో ఈనెల 13, 19, 23 తేదీల్లో, ఆళ్లగడ్డ సబ్ కోర్టులో 14, 20 తేదీల్లో జడ్జి అందుబాటులో ఉంటారని వివరించారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

నంద్యాల(అర్బన్): రాయమాల్పురం గ్రామంలో బాల్య వివాహం చేసేందుకు ఇరు కుటుంబాలు సిద్ధమవుతుండగా గురువారం అధికారులు అడ్డుకున్నారు. గ్రామంలో అమ్మాయి మేజర్ అయినా.. అబ్బాయికి 16 సంవత్సరాల ఆరు నెలలు ఉండటం, ప్రేమ పేరుతో పెద్దల ఒప్పందాలు చేసుకొని పెళ్లి చేయాలని నిశ్చయించుకున్నారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ శ్రీనివాసులు, డీటీ రామచంద్రారావు, ఈఓఆర్‌డీ జ్యోతి, సూపర్‌వైజర్ ఆరోగ్యమ్మ తదితర అధికారులు గ్రామానికి చేరుకుని విచారణ చేశారు. బాలుడికి 16 సంవత్సరాలు మాత్రమే నిండాయని తెలుసుకుని శుక్రవారం నిర్వహించాల్సిన పెళ్లిని నిలిపివేశారు. విచారణ నిమిత్తం బాలుడిని పోలీసుల సాయంతో అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌కు అప్పగించారు.

